

# మ్యూజియంలో మ్యూజింగ్సు

రుద్రాభట్ల నరసింగరావు

సౌభాగ్యవతి సీతకి,

ఆశీర్వచనాలు అననా? ఏదీ? కృతజ్ఞత నిండి పోయిన నా గొంతులోంచి మాట పెగలదే?

నువ్వొస్తానని రాశావు. స్వర్గం నాకోసం వొస్తుందని అర్థం చేసుకున్నాను.

ఎన్నాళ్లకి రాశావు సీతా?—అని ఇప్పుడని పిస్తోందిగాని, నీ ఉత్తరంచూసిన క్షణంలో మన పెళ్లయిన తొమ్మిది గంటలకి నీదగ్గర నుంచి ప్రేమలేఖ వొచ్చినంత ఆనందం కలిగింది.

ఇహ రాదనుకున్న బస్సు రావడమే గాదు, అందులో సీటుకూడా దొరికినంత సంతోషపడ్డాను—అనేవాడు నీ భర్త ఏ పట్న వాసపు మగ్గంలోని కండెపోటో అయివుండి నట్లయితే.

అప్పుడు అతనికి బోలెడు ప్రపంచ జ్ఞానం ఉందనుకొని తృప్తిపడేవారు అత్త గారూ వాళ్లూ.

కాని నేను పల్లెటూరిజీవితాన్ని అందులో మళ్లీ ఏకాంతాన్ని ప్రేమించేను. అది ఓ నేరం.

నా అనేవాళ్లు లేని దౌర్భాగ్యుణ్ణి నీలాటి అర్ధాంగికోసం ఆశపడ్డాను. అది నా రెండో తప్పు.

పెళ్లినాటికి దగ్గుతో బాధపడుతున్నాను. అది నా మూడో దోషం.

అల్లుడిగానన్ను మరిచిపోదామని ప్రయ త్నిస్తూ వుంటారు నీ తల్లిదండ్రులు. కాని పై నేరాలుచేసిన కిరాతుడిగా జ్ఞాపకంవొచ్చి బాధపెడుతున్నానేమో.

నువ్వుగూడా వారిమొస్తరేఅనుకున్నాను

ఎంత అపోహపడ్డాను? నిజమే. కాని నిన్ను అర్థం చేసుకునేపాటి అవకాశం ఎక్కడ? ఆ పెళ్లి నాలుగ్గడియలూ ఏం కలిసి వున్నామో? అంతే. అంతకుముందు గాని ఆ తర్వాతగాని మనం కలుసుకోలేదు సరిగదా, ఒకరిగురించి ఒకరు విననయినా లేదు. నువ్వు నా ఎడ్రసు సంపాదించడానికి పడిన అవస్థ చదువుతూంటే నాకు నవ్వూ ఏడుపూ రెండూ వొచ్చేయి.

నన్ను నీకింత పరాయివాడిగా చేశారు—మన జీవితాల్ని ముడివేసినవారు.

పెళ్లిలో నా ప్రవర్తన అందరికీ వింతగా కనబడివుంటుందని తర్వాత సంఘటనల్ని బట్టి తెలుసుకొన్నాను. రకరకాల వ్యాఖ్యా నాలు విన్నాను.

'పాపం నా అనేవాళ్లు లేరాయె. తనకి గొప్ప శుభం జరుగుతున్నప్పుడు ఆలోటు మరీ కొట్టొచ్చినట్టు కనబడ్డం సహజం.' అన్నాడు దిగులు అనుకున్నవాళ్లలో ఓ అనుభవజ్ఞుడు.

మా స్నేహితుడు ఒకడికి కాలు అవుకు. హుషారుగానే ఉండేవాడు. తాంబూలాలు పుచ్చుకున్ననాటి రాత్రి పక్కమీదపడి ఏడ్చిన ఏడుపు మరిచిపోలేను.

'అదేవిఁటి ఓవిడా అంతపరధ్యాన్నం? ఇతగాడి వరస చూస్తూవుంటే మన పిల్లతో మాటయినా ఆడతాడంటావా?' అని బుగ్గ నొక్కుకున్న స్త్రీలు కొందరు.

అత్తగారి అనుమానాలు చెప్పక్కర్లేదు.

'ఎటూ ఏ దిక్కూ లేని ఈ సమ్మంధం మనకి వొద్దు మొర్రో అంటే విన్నారు కాదు. అయినా ఈ కొంపలో నా మాట ఎప్పుడు పనికొచ్చింది గనక. ఆ దగ్గేవిఁటో. వొట్టి వెర్రిబాగులవాడిలా వున్నాడు. పిచ్చి లేక పోయినా అమాయకత్వం వుంటే చాలద టండీ అమ్మాయి బతుకు అభాజనం కావడానికి?'

మామ గారు తలొంచుకుని నిట్టూర్చేరు.

'మీకూ మీ కూతురికీ నచ్చిన కుర్రాడి వరస ఇదీ! కట్నం లేకుండా వొస్తున్నాడని వూ ఎగబడ్డమే. నే నప్పుడే అనుమానించాను.'

అత్తగారికి భర్తని సాధించటానికి ఇంత కంటె మంచి సందు దొరకదు. కాని ఆ విజయంలో నీ గురించిన బాధే ఎక్కువయింది ఆవిడకి.

'ఎన్నాళ్ల బట్టి వొస్తోంది ఇలా?' అనడిగారు మామ గారు దగ్గుతున్న నన్ను.

'మూడేళ్ళుగా, మా అమ్మా, నాన్నా పోయిన తర్వాతనుంచి.'

నేనే మూడేళ్లన్నానంటే, పుట్టు చేటూ నాకీ రోగం వుండి వుంటుందనుకున్నారేమో అత్తగారు.

ఆడ వాళ్లంతా ఆయన చుట్టూ చేరి గోల మొదలెట్టారు.

మామ గారికి ఆ ఒత్తిడి చాలా చిరాకు కలిగించింది. ఆయనే అందరి మీదా కేకలు వేసుకున్నారు. కాని అవి ఓడి పోయిన మనిషి కేకల్లా వినిపించాయి. నా మీద ఆయన పెట్టుకున్న ఆశల్ని ఇప్పుడింతమంచి కాదని రుజువు చెయ్యడంతో ఆయనకి ఓర్పు చచ్చి పోయినట్టు అనిపించింది.

కాని ఆయన గాంధీ అనుచరులు. స్వాతంత్ర్య సమరంలో నిలబడిన వ్యక్తి. అంటే ప్రస్తుతపు ఓటమికి కుంగిపోక అంతిమ విజయంలో విశ్వాసం ఉంచడం నేర్చుకున్న తరహా మనిషన్నమాట.

ఏమయితేనేం, ఆ వేళ మన నెత్తిమీద పడిన అక్షింతల్లో కాస్త మనస్ఫూర్తిగా వేసిన వంటూ ఉన్నాయీ అంటే అవి మీ నాన్నగారు ఒక్కరు వేసినవే.

తర్వాత జరిగిన పేచీలూ అవీ నువ్వెరగనివి గనకనా?


నేను తలదించుకుని వచ్చేశాను.

పెళ్ళి కొడుకంతటి వాణ్ణి ఎవరూ వుండమన లేదంటే వొట్టి మనిషిని మెడ పట్టి గెంటినంత.

ఇవన్నీ నేను మనసులో పెట్టుకున్నానని అపోహపడేవు సుమా, సీతా!

ఎన్నడూ లేదు. పోగా, ఆ నాటి నా ప్రవర్తన గురించి నీకు సంజాయిషీ ఇచ్చుకోవాలని ఎన్నో మాట్లు ప్రయత్నించేను. కాని నా వూహలు కాగితం మీద పెడితే నాకే వింతగా అగపడేవి. అవి చదివితే






నేను పిచ్చివాణ్ణి అని ధ్రువపరుచుకుంటావని భయం వేసేది.

ఇప్పుడా?

నే నెంత పిచ్చివాణ్ణీ, రోగిష్టినీ, దిక్కుమాలిన వాణ్ణీ అయితే నువ్వంత త్వరితంగా, తప్పనిసరిగా నా దరికి చేరుకుంటావని నమ్మకం కలిగింది—— నీవుత్తరంలో నాపై కురిసిన జాలి ఎంత గొప్పది! నన్ను ప్రేమించగల మనిషి అవసరం నాకుందని ఎంత చక్కగా గ్రహించావు! ఇంకా నన్ను సరిగా అర్థం చేసుకోలేదని వాపోతున్నావా పైగా?

ఎవరి మీద మనకి జాలి వుంటుందో వాళ్లని అర్థం చేసుకోవడం సులభం.

అందుకే నీ దగ్గర ఏమీ దాచుకోవాలనిపించడం లేదు, సీతా.

బయట మధ్యాన్నం నించి ఎడ తెరిపి లేకుండా వాన కురుస్తోంది. వాన కురుస్తున్న పూటలు ఒంటరిగా ఈ గదిలో గడపడం నా కెంతో యిష్టం. వాన ఏకాంతానికి భద్రత కలిగిస్తున్నట్టు తోస్తుంది నాకు. అప్పుడు నా గదికి మిగతా ప్రపంచంతో సంబంధం తెగిపోతుంది. నేనూ, నా జ్ఞాపకాలే మిగులుతాం.

ఈ జ్ఞాపకాలున్నాయి చూడు, ఇవి చాలా చిత్రమైనవి. వీటిని రేపే సంఘటనలు, దృశ్యాలూ, వాసనలూ ఎన్నెన్నో! ముఖ్యంగా వాసనలు. నేను వాసనల్ని

ప్రేమిస్తాను— అవి నా కిచ్చే స్మృతుల కోసం.

హైదరాబాద్‌లో మా మేనత్త గారింట్లో వుండగా చాటుగా ఓ తల నూనె రాసుకునే వాణ్ణి. అత్త చూసినా కోప్పడదు. ఆ సంగతి ఎరుగుదును. కాని పిరికితనం అడ్డొచ్చేది. ఈ పిరికితనం లేక సున్నిత మైన హృదయం — ఇప్పటికీ నాలో ఉండ బట్టే నిన్ను తెచ్చుకోలేక పోయాను. సరే. ఆ తలనూనె వాసనచూస్తేచాలు హైదరాబాద్ లోని నా గతజీవితంలోకి వెళ్ళిపోగలను. అందుకే ఓ సీసా ఎప్పుడూ నా గదిలో ఉంటుంది. కాని దాన్ని వాడను మళ్ళీ— మెదడుకి మంచిది కాదని.

ఇలా ఆరోజుల్ని తలుచుకోదలుస్తున్నా నంటే ఆ రోజు లెంతో సుఖంగానో, మంచి అనుభవాలతోనో గడిచా యనుకునేవు! హైస్కూలు కుర్రాడి జీవితంలో చెప్పుకో దగ్గ అనుభవాలు ఏముంటాయి? — తెలుగు పండితుణ్ణో, అమ్మాయిల్నో ఏడిపించి చివాట్లు తిన్న అనుభవాలు మినహాయిస్తే? సుఖమా? దయగలవాళ్ళ నైతం ఇంటి కొచ్చిన బీదచుట్టాన్ని సరిగా ఆదరించ డానికి సిగ్గు పడతారు. అత్తయ్య తప్ప మిగతా వాళ్ళకి నాతో ఒక్క మాట అన డానికి కూడా మన సొప్పేది కాదు.

ఒక్కటి మట్టుకు నిజం. బాగా తిండి దొరికేది. అవన్నీ తింటున్నప్పుడు నా మనస్సు ఏడ్చేది-అమ్మా నాన్నా ఏ జన్మానా ఓ పూరీ ముక్కయినా ఎరగరు గదా అని.

అంత పట్నంలో ఆ ఇంట్లో నేను ఒంటరినయి పోయా ననిపించేది.

తన ట్యూషన్లు. బ్రాహ్మణార్థాలకి మట్టుకు నేను వారసుణ్ణి కారాదనేదే మా నాన్న కల. ఓ ముక్క వొస్తే ఎక్కడో అక్కడ ఉద్యోగం చేసుకుని బతుకుతాను గదా అన్న ఆశతో నాన్నా—

తను కెలాగా లేదు పిల్లడయినా శుభ్రంగా తింటాడనే ఆశతో అమ్మా—

నన్ను వొదిలి వుండడానికి ఒడంబడ్డారే గాని నా ఎడబాటు వాళ్ల కెంత దుర్భరంగా ఉండేదనీ!

ఎప్పుడయినా సెలవులకి - అదయినా అత్త టిక్కెట్టు సొమ్మిచ్చి పంపితే-ఇంటికి వొచ్చేవాణ్ణి.

కోన సీమలో నా యిల్లు కొబ్బరి తోటల మధ్య కాలవవొడ్డున బిక్కు బిక్కు మంటూవుంటుంది. ఇంటి వెనక ఒక మోడు రావిచెట్టు. వసంతం వొచ్చినపుడు మాత్రం ఆకులు తొడిగి గల గల నవ్వేది. ఎండాకాలం సెలవులకి నేను వొచ్చినందుకు అది పూః సంబరపడి పోతుందేమో అని పించేది.


ఈ నా గది కిటికీలో నుంచి ఓ రావిచెట్టు కనిపిస్తూవుంటుంది. అదంటే నా కెంతో యిష్టం. అది నా గత జీవితాన్ని నాకు పాడి వినిపిస్తున్నట్టు అనిపిస్తుంది.

కాని దాన్ని నమ్మలేను. అసలు నాకు ప్రస్తుతానికి భిన్నంగా ఉండే గత జీవితం ఉందా అనిపిస్తుంది. అదంతా ఓ కలేమో అనుకుంటాను. అంతలోనే ఆ భ్రమ తొలగిపోతుంది.

ఇప్పుడు నేను వేసుకుంటున్న ఈ బొంత మా అమ్మ కుట్టినది.








ఒకసారి సెలవులికి నేను ఇంటికి వెళ్ళే టప్పటికి లోగుమ్మంలో కాళ్ళు చాపుకుని ఈ బొంతని వొళ్ళో పెట్టుకొని కుడుతోంది. అది సాయంకాలం.

నేను గుమ్మంలో అడుగుపెట్టగానే అమ్మ తటాలున లేచివొచ్చి నా కాళ్ళదగ్గిర కూల బడి అలాగే నన్ను కౌగలించుకుని 'చదువూ వొద్దు, సంధ్యా వొద్దు. నువ్వు నన్ను వొదిలిపెట్టి వెళ్ళిపోకు.' అని ఏడ్చింది. (తీరా వెళ్ళిపోవలసిన రోజు వొచ్చేటప్ప టికి నన్ను ఉండమనలేదు. చాటుగా ఆవిడ ఏడవడం' నాన్న మందలించడం మట్టుకు ఎరుగుదును.)

నేను ఉన్నన్నాళ్ళూ అమ్మ లక్ష అను మానాల్ని వెలిబుచ్చింది:

'అత్తశుభ్రంగాఅన్నంపెడుతున్నాద్రా?'

'అబ్బో నన్ను చాలా బాగా చూస్తుం దమ్మా అత్తయ్య - అన్నింట్లోనూ.'

'పోనీలే నాయనా. నిన్ను వొదల్లేక వొద లేక వొదలి బతుకుతున్నాను.' అని మళ్ళీ ఏడ్చింది. తృప్తినైతం ఏడుపునే తెప్పిస్తుం దనుకుంటాను మాతృమూర్తికి.

ఓరోజు మినపరొట్టె కాలుస్తూ వుంది అమ్మ. నేను కుంపటిదగ్గర కూర్చున్నాను.

'ఇలా ఎప్పుడైనా ఓరొట్టెముక్కయినా కాల్చిపెడతాద్రా అత్తయ్య?'

అమ్మని సంతోషపెట్టడానికి 'రొట్టె ముక్కేం? పూరీలూ, దోసెలూ రోజూ ఏదో టిఫినేగద అమ్మా?' అనేవాణ్ణి. కాని

అంతలోనే నామాటల్లో అమ్మ అంత అప్యాయతతో చేసి పెడుతున్నదాన్ని చులకన చేసిన ధ్వని వుందేమో అని భయపడుతూ 'కాని నాకీ రొట్టె అంటేనే చాలా ఇష్టం అమ్మా.' అనేవాణ్ణి.

నేను వాడని సబ్బుబిళ్ళ ఒకటి చూస్తావు సీతా, నాగదిలో. అది నాన్నగారికి ఇష్టమైన సబ్బు. కళ్ళుమూసుకుని దాని వాసన చూస్తూంటే నాకాయన అవుపిస్తారు. ఇది రాస్తున్న సమయంలో నా ఎడంచెయ్యి ఆ సబ్బుని అందుకుందికూడా.

ఆనాలుగురోజులూ ట్యూషను కుర్రాళ్ళ నలుగురితోపాటు నన్నూ కూర్చోబెట్టుకునేవారు నాన్న. నా తెలివితేటలకి ఆయన చాలా సంతోషిస్తున్నట్టు అగపడేవారు. ఎక్కువసేపు కూర్చోమనేవారుకాదు — నా సరదాలకి అడ్డుతగులుతున్నానేమో అని భయపడి.

కాని నేను ఎక్కడికీ తిరిగేవాణ్ణికాను. నేను దగ్గిరకూర్చుంటే అమ్మమొహంలో మెరిసే తృప్తి చూడ్డమే నాకు ఆనందంగా వుండేది.

ప్రతీ మధ్యాహ్నమూ ఇప్పుడు నేను వేసుకుంటున్న బొంత కుడుతూ కూర్చునేది అమ్మ.

'ఎందుకమ్మా అంత శ్రమ ?'

'ఊరికే కూర్చుంటే ఏవౌతుంది నాయనా ? అక్కడ నీ పడకా, బోజా చూసేదెవరు ? మొన్న రావమ్మగారు పనిమనిషికి స్తానంటే వొద్దందిట - పటంలాటి చీర. ఇది పైనవేసి కుట్టానంటే ఎంత బావుంటుందనుకున్నావు ! నీ పెళ్ళాంవొచ్చేదాకా వేసుకున్నా చలనం వుండదు.' అంటూ నవ్వేది అమ్మ.

అమ్మకి కోడలు రావాలని ఎంత ఆశ !

ఈనాడు నువ్వొస్తానని రాశావు కాని నేను వొట్టి నిర్భాగ్యుణ్ణి సీతా, అమ్మ లేదు.

అమ్మా నాన్నా ఎంతో వాస్తవంగానూ, శాశ్వతంగానూ కనిపించేవారు నాకారోజుల్లో. వాళ్ళు లేని నా స్థితిని ఊహించవలసిన అవసరం కూడా కలగలేదు నా కప్పుడు.

వాళ్ళు పోవడంతో నాకు అంతా నిష్పచ్చరంగా కనబడింది. ఎందుకు బతకాలో అర్థం కనిపించని రోజుల్లో ఈ ఉద్యోగం వొచ్చింది. బతకడమేకాదు, ఉద్యోగాన్ని కూడా నిర్వహిస్తున్నాను !

నిన్న నీ లేఖ వొచ్చేక ఏదో ఓరోజున ఇలాటి అదృష్టం నన్ను వరిస్తుందనే ఆశే అవ్యక్తంగా ఇన్నాళ్ళూ నన్ను నిలబెట్టిందనిపిస్తోంది.

ఉద్యోగమూ, ఓ మారుమూల పల్లెటూళ్ళో. నివాసమూ, దీపం పెట్టుకునేవాళ్ళు లేక వొదలివేయబడిన ఒక విశాలమైన ఇంట్లో ఒక పెద్దగది.

పెద్దగదీ, తక్కువ సామానూ వొంటరితనాన్ని ఎక్కువ చేస్తా యనిపిస్తుంది. ఒంటరి మనిషి వొస్తువుల్ని ప్రాణం వున్నవాటిలా ప్రేమిస్తాడు. (లేక కేవలం ఇది నా అనుభవమేనా ?)

వొస్తావుగదా, చూద్దువుగాని నా సామాను ఎంత తక్కువో.

క్యాంపుల్లో వున్నప్పుడు బెడ్డింగుకట్టుకోడానికీ, ఊళ్ళో వున్నప్పుడు దణ్ణెంగానూ పనికొచ్చే ఓ బెడ్డింగ్‌రోప్. పడుకోడానికీ, మూట కట్టుకోడానికీ ఉపయోగించే ఒక జంబుఖానా. బట్టలు పెట్టుకునే సంచీయే తలగడా. దారు సామానువున్న గదులపెట్టె. లాంపు పెట్టుకునే ఎత్తు. రెండుగిన్నెలు, కుంపటి. ఒక పెద్ద బకెట్ - వీటి ప్రయోజనాలు చాలా ఉన్నాయి. వీటన్నిటితోనూ నేను నా ఒంటరి గంటలలో మాట్లాడతాను అవిమట్టుకు మూగగా నన్ను చూస్తూ వుంటాయి. అయితే నాతో మాట్లాడేవీ ఉన్నాయి. అవే, నా పుస్తకాలు; ఎప్పుడైనా దూరపు స్నేహితుల్నించి వొచ్చే వుత్తరాలు.

వీటన్నిటితో నాకు బాగా స్నేహం ఏర్పడిపోయింది.

రెండురోజులు నేనెక్కడయినా వుండిపోయినట్లయితే, చీకట్లని పారదోలగలిగీ, చీకట్లో బిక్కుబిక్కుమంటూ కూర్చునే పెళ్ళయినా భర్త ఇంటికి రాలేని నవోఢలాటి నా ల్యాంపూ, పరిమళాన్ని తనలో ఉంచుకునీ మూతతీసేవారు లేక ఒదిగి కూర్చుని జాలిగా చూసే బాలవితంతువులాటి నా తలనూనెసీసా....ఇలా అన్నీ నాకోసం ఎదురు చూస్తున్నట్టు ఊహించుకుంటాను.

మళ్ళీ నాగది చేరుకునేదాకా తీర్థంలో తప్పిపోయిన పిల్లడిలా తిరుగుతాను.

అలాగే మన పెళ్ళిలోనూ చేశాను. (చేసి వుంటాను.)

ఇక నారెండో తప్పుకి సంజాయిషీ ఏమని చెప్పుకోవాలో నాకు తెలియడం లేదు. నీ అందంలో, నీకదలికల్లో కథల్లోని మణులకువలె బాధని తీసివేయగలిగే ఏ గుణమో కనబడింది. అలాటిపిల్ల నిస్తానంటే వొద్దనగలిగే శక్తి నాకు లేకపోయింది. నాకు అర్హత లేదన్న ఆలోచనే రాలేదు.

నా మూడోదోషం దగ్గు - కాదు, దాని గురించి అబద్ధం చెప్పకపోవడం. "వారి జాతులందు వైవాహికములందు." పద్యం ఏనాడో చదివాను. కాని దాని అర్థం మన పెళ్ళిలో జరిగిన సంఘటన వల్ల తెలిసింది.

నీదగ్గర ఏమీ దాచను, సీతా, దాచలేను.

ఆహార విహారాదులపట్ల నా నిర్లక్ష్యంపు ఫలితం ఈదగ్గు.

ఆ నిర్లక్ష్యానికి కారణం - తల్లిదండ్రులను దక్కించుకోలేని నేను బతకడం పాపం అనే వూహ.

ఫలితం - ఆత్మానుకంప

దగ్గు మొదలయినప్పటినుంచీ గ్లైకోడిన్, సిరోలిన్, కాసబిన్ మొదలగు ఇనంతము లయిన "కాఫ్‌సిరప్పు"లను అనంతంగా వాడేను - తత్కాంతికి. పూర్ణారోగ్యవంతుణ్ణవాలనే, ఉండేది కాదు.

---

● ఒక ప్రముఖ నాయకుడు రెండు గంటలసేపు అనర్గళంగా ఉపన్యాసం యిచ్చి "ఎవరికైనా సందేహాలుంటే అడగవచ్చు" అన్నాడు.

సభలోంచి ఒకడు లేచి "అయ్యా! ఇంతవరకు మీరు మాట్లాడింది దేన్ని గురించో సెలవిస్తారా?" అని అడిగాడు.

—అంకలపల్లి మహంకాళేశ్వర రావు. ఏలూరు.

కాని నిన్ను తొలిసారి చూసిన తర్వాత జీవితం మీద మమత కలిగింది.

విశాఖపట్నం పరిగెత్తాను. నా జబ్బు ప్రమాదకరమైనది కాదని తేల్చారు.

మన పెళ్ళినాటికి తగ్గుతూ తగ్గుతూవుంది.

ఇప్పటికి చాలావరకూ నయమయినట్లే.

నీ అమృత స్పర్శతో ఆ మిగిలినకాస్తా ఎగిరిపోతుందని నాకు నమ్మకమే.

రా సీతా. నాకు పునర్జన్మనియ్యి.

ఇవాళే పట్నం వెళ్ళి గోద్రెజ్ పడక కుర్చీలూ, పరుపూ మంచాలూ కొంతపాత్ర సామానుతెచ్చి ఈ ఇంటిలో మిగతాగదుల్ని అలంకరించి వుంచుతాను.

క్రమేపీ అన్నీ నీ సలహామీద అమర్చుకోవచ్చు.

ఈ గదిని మట్టుకు ఇలాగే వుంచుతాను.

ఇందులో వొస్తువులు నాకెంత ప్రియమైనవో ఈపాటికి గ్రహించి వుంటావు. నా గతజీవితపు జ్ఞాపకాల్ని ఇస్తాయి అవి. నా గత జీవితంలో చాలామట్టుకు చేదుఅనుభవాలే నిండి వుండవచ్చు. కాని స్మృతి ఎప్పుడూ మధురమైనదే - చేదు మాత్ర మింగిన తర్వాత వొచ్చే తీయవాసనలాటిది.

ఈ వొస్తువులన్నిటితో యీ గది నిలాగే వుంచుతాను. అయితే యీ గది నువ్వొచ్చిన నాటి నుంచి ఉపయోగించం. గొళ్లెం పెట్టి ఉంచుతాం. ఇదివరలో ఎన్నోమాట్లు చేసినట్టు ఎప్పుడయినా ఈ గదిలో కూర్చుని మ్యూజింగ్సులో తేలిపోవచ్చు— ఈ వొస్తువుల్ని చూస్తూ. ఈ గదికి మ్యూజియం అని పేరు పెడతాను.

మ్యూజియంలో వొస్తువులు సాధారణంగా కష్టపడి సేకరించినవై ఉంటాయి. కాని నా మ్యూజియం విషయం అలా కాదు. నా కష్ట సుఖాల్ని పంచుకున్నవి ఇందులో వొస్తువులు.

ఇక ముందు ఆ పని నువ్వు చెయ్యబోతున్నావు. కాని నువ్వు వాటికంటె గొప్ప దానివి. ఎంచేతంటే, నా కష్టాల్ని పంచుకుని సుఖాన్ని పెంచడానికి వొస్తున్న సర్సువి (ఆ మాట విస్తృతార్థంలో) నువ్వు.

నా ఏకాంతానికీ బయటి ప్రపంచానికీ మధ్య నున్న తెరలు ఎత్తుతున్నట్లు వాన వెలుస్తోంది.

నా ఉత్తరం ఆపక పోతే దీన్ని చదవడంలో పడి నువ్వు ఆరోజుకి రాక పోయే ప్రమాదంవుంది.

అయితే బాగా వాకబు చేశావన్నమాట ఇక్కడికి ఎలా రావాలో. ఇంకా నేను సలహాలిస్తే చాదస్తుడిని అనుకుంటావు. అవును. కాకినాడలో ఆ వూరు వచ్చే బస్సెక్కు. దిగడం వూసు నీ కక్కర్లేదు. నేను దింపుకుంటాను నా దేవతని.

సంతకం పెట్టేదామని ఆలోచిస్తూ అవతలికి చూశాను. చూరునించి పడలేక పడలేక పడుతున్నాయి ఆఖరి నీటిబొట్లు. నువ్వు పుట్టి పెరిగిన ఇంటినుంచి, తల్లి దండ్రులనుంచి నీ ఎడబాటులో కష్టం ఎంతటిదో తట్టింది.

సవ్యంగా కాపరానికి వెళ్ళే ఆడపిల్లకయినా తల్లి దండ్రుల్ని మొదటిసారిగా వొదలవలసి రావడం ఎంత బాధాకరం! అలాటిది నీ అంతట నువ్వు ఎవ్వరికీ చెప్పకుండా కేవలం అదృష్టాన్ని నమ్మి నాకోసం వస్తున్నావంటే ఎంత త్యాగం చేస్తున్నావో ఎరుగుదునా అని? ఈ సంఘర్షణలో కాలినప్పటికీ నీ నిశ్చయం ఏ మాత్రం సడలదనీ, నూతన శక్తితో, పుటం పెట్టిన పుత్తడిలా మెరిసి పోగలదనీ నాకు నమ్మకమే.

తప్పక రా సీతా — అనడం నిన్నింకా అర్థంచేసుకోని నా అజ్ఞానాన్ని వెల్లడిస్తోంది.

పునస్సమాగమానికై ఎదురు చూస్తూ జీవించే,

నీవాడు,

రామచంద్రరావు.

● ● ●


ఈ పుస్తకం లాంటి ఉత్తరాన్ని పోస్టు చేసిన నాల్గోనాటి సాయంకాలం.

జట్కా బండిలో బస్సు ఆగే వూరివైపు ప్రయాణిస్తున్నాడు రామచంద్రరావు.

ఎర్రని మట్టిరోడ్డు కిరుప్రక్కలా చిన్న చిన్న కొండలు. వాటిపై తీరిగ్గా మేస్తున్న పశువులు. చెట్ల నీడల్లో గోళీలాడే కుర్రాళ్ళు —ప్రతీదీ రామచంద్రరావుకి ఉత్సాహాన్ని కలిగిస్తోంది ఈ రోజున—ఇదివర కెన్నో సార్లు చూసిన దృశ్యాలే మళ్ళీ.

ఆ నాలుగుమైళ్ళూ తరగని దూరంలా ఇట్టే గడచిపోయినట్టూ కూడా అనిపించింది.

బస్సుస్టాండు తెల్ల కలువల చెరువు పక్కనే వుంది. కుర్రాళ్ళు దిగి పువ్వులు కోసుకుంటున్నారు. రావిచెట్టుక్రింద నిలబడ్డాడు రామచంద్రరావు. ఎందుకో ఆ చెట్టు కంత కులుకు? ఒకటే గలగల. వసంతం వొస్తోందనా?



నిముషాలు లెక్కేస్తూ నించున్నాడు.

ఆఖరి కెలాగయితేనేం రామచంద్రరావు ఎదురుచూస్తున్న బస్సు వొచ్చింది.

స్టాండులోకివొస్తూనే ఆగకుండా కొంచెం ముందుకీ వెనక్కీ నడిచి తిరుగు ప్రయాణానికి అనువైన పద్ధతిలో నించుంది.

ఇంజను నోరు మూసుకుంది.

దిగే వాళ్ళు దిగుతున్నారు. స్టాపులో కనబడ్డ పరిచయస్థులు వాళ్ళని పలకరిస్తున్నారు.

'కాకినాడ నుంచేనాండి? ఎలావుంది రేటు?'

'ప్చ్. డవునయిందండీ. రెండున్నర.?'

ఎంతమీద రెండున్నరో మూడో వాడికి తెలీకూడదు. ప్రతీదీ రహస్యమే—రహస్యంగా ఉంచుకోవలసిన గొప్ప సంగతులు లేని జీవితాలు వీళ్ళవి.

అన్నట్టు తన ప్రణయకేక ('లేఖ'కి అచ్చు తప్పు) ప్రియురాలికి రహస్యంగా చేరిందా? ఛ. వెధవ అనుమానాలు.

'ఇదేనాండి రావడం? కులాసా?'

'ఏదో ఇలా వున్నాం.'

'అబ్బాయి ఎక్కడ?'

'ఏదీ ఇంకా ఎక్కడా కాందే.'

ఉద్యోగాల గోల.

తన దేవత ప్రత్యక్షం కాలేదు. రామచంద్రరావు భూమిలోనికి కుంగిపోతున్నట్టు అయిపోయాడు.

అంతలో ఖద్దరు పంచె, లాల్చీతో, గౌరవాన్ని కలిగించేపాటి స్థూల దేహులైన మామగారు దిగేరు.

ఆశ్చర్యపోయేడు రామచంద్రరావు భయపడ్డాడు. తన ప్రళయరేఖ (ప్రణయ లేఖకి మరో అచ్చుతప్పు అని వేరే చెప్పాలా?) బయటపడి వుంటుంది. మొహం వాచేలా చీవాట్లు వేస్తారు తప్పదు.

ఆయన దిగుతూనే అందుకున్నారు. 'అదేవిఁటోయి? అలా తెల్లబోతున్నావు. సీతరాలేదనా? వొస్తుందొస్తుంది. నేను చచ్చేననుకుని అది నీకు ఉత్తరం రాయడం, ప్రభుత్వం వారిచ్చిన బిరుదులతో కుబేరుణ్ణయేననుకుని కాబోలు నువ్వు దానికి రమ్మని రాయడం - బాగుంది వరస. ఆనాడునువ్వు కట్నం వొద్దంటే సంబరపడినప్పుడే నేను కుబేరుణ్ణి కానని గ్రహించి వుండవలసిందే నువ్వు. పోన్లే. కుర్రతనం. మీరేం గ్రహిస్తారు. పద కాఫీతాగి వద్దాం. వొచ్చేటప్పుడే రెండు టిక్కెట్లు చెప్పేను కండక్టరుకి.' అంటూ జబ్బ పట్టుకుని రామచంద్రరావుని హోటలు వైపు లాక్కుపోయారు మామగారు.

కొంచెం అర్థం అయి ఆనందంతో ఉక్కిరి బిక్కిరవుతున్న రామచంద్రరావు ఏం మాట్లాడలేకపోయేడు.

సప్లయ్యర్ రామచంద్రరావు వైపు ప్రశ్నార్థకంగా చూశాడు.

'కుబేరుణ్ణి అంటే అర్థంకాలేదోయి? మేఘ సందేశంలోని విలన్? - ఆఁ-రెండు కాఫీలుపట్రా నాయనా. నాదాంటో పంచదార వెయ్యకు.'

ఆనందంగా నవ్వేడు రామచంద్రరావు. 'మీలాటివారిని ఈ చీనాసమస్య తాకదు.' అన్నాడు— నవ్వినప్పుడేదో జోకు లాటిది అనాలిగదా అని.

'చీనా సమస్య మమ్మల్ని తాకదూ? ఇంకా నయం. దాస్యం అంటే ఎరగం అన్నావుకాదు!' అన్నారాయన గంభీరంగా తనమీద ఏదో అభియోగం మోపబడినట్టు. అసలాయన మనస్సంతా కూతురిమీదఉంది. తనని తిట్టుకుంటూ ఉంటుంది. ఇంటికి వెడుతూనే 'సీతా ఎవర్ని తెచ్చానో చూడు!' అనాలి. అప్పుడుచూడాలి వెర్రితల్లి మొహం!

కాఫీలు వొచ్చేయి. అందుకున్నారిద్దరూ. కాని నోటికందించలేదు. మామగారు చెప్పసాగారు.

'పెళ్ళిచేసినవాణ్ణి లక్షణంగా కార్యం చెయ్యనుటోయి? మీ అత్తగారికిమాత్రం ఆ ముచ్చట లేదనుకున్నావా? కాకపోతే నిన్నూ నీ ఊహల్నీ ఆవిడ చప్పున అర్థం చేసుకోలేక పోయింది. అసలు ఒంటరి జీవితం గడిపేమనిషి చేష్టలు ఎవ్వరికీ అంత తేలిగ్గా అర్థంకావోయి. నలభైరెండులో జెయిల్లో వున్నప్పటి నా ఊహలు చెబితే నువ్వేనవ్వుతావు. ఆవరణలోని మొక్కలతో మాట్లాడేవాణ్ణి. ఉత్తరాలని కౌగలించుకుని పడుకునేవాణ్ణి....కాఫీతాగు.' అని ఆయన గడ గడ తాగేశాడు.

కాఫీ తాగుతుంటే రామచంద్రరావుకి తను కొత్తగా అలంకరించిన గది జ్ఞాపకం వొచ్చింది. అందులోని ప్రతీ వొస్తువూ తనూ, సీతా రావడంకోసం ఎదురు చూస్తూ రానందుకు నొచ్చుకుంటా యేమో అన్న వూహ వొచ్చింది.

గ్లాసు కింద పెడుతూ నవ్వుకున్నాడు. తను ఇలాటి వూహలింక వొదిలెయ్యాలి. తను ఇంక వొంటరి మనిషి కాడు.

"ఇక్కడే ఆ ముసి ముసి నవ్వులన్నీ ఒలక బోసెయ్యకోయి! పద. హారన్ మోగుతోంది." □□□



---

● ఒక జిల్లా పరిషత్తు హైస్కూలు మేష్టారింట్లో దొంగలు పడ్డారు. తెల్లారి లేచేసరికి ఇంటినిండా కాగితాలు, కాంపోజిషన్ పుస్తకాలు చిందరవందరై వున్నాయి. "ఏమన్నా పోయాయేమో చూడండి" అని ఇరుగు పొరుగు వాళ్ళు సలహా ఇచ్చారు. మేష్టారు ఇల్లంతా వెదుకుతుండగా డ్రాయరు సొరుగులో ఒక పది రూపాయల నోటుకు గుచ్చి ఒక కాగితం ముక్క కనబడింది. దానిమీద ఇలా రాసి వుంది: "నువ్వెలా బతుకుతున్నావో మా కర్థం కావటం లేదు."

ఎమ్. సత్యనారాయణ రాజు, వాల్తేరు.